ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
బుధవారం 27 నవంబరు 2024



ఆర్టీవోలో.. ఘరానా వసూళ్లు!

అవినీతికి కేరాఫ్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాలు

- దళారులుంటేనే పనులు.. లేదంటే ఇబ్బందులు
- ఆన్‌లైన్ ఉన్నా.. 'ఆ లైన్'లో రావాల్సిందే
- 'కోడ్' ఉంటే చకచకా.. లేదంటే ఫైలు పక్కకే
- రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఫిట్నెస్, పేరుమార్పు.. పనేదైనా వారుండాల్సిందే
- దళారులతో కొందరు ఆర్టీవో అధికారులు, సిబ్బంది కుమ్మక్కు
- తప్పని పరిస్థితుల్లో మధ్యవర్తులను ఆశ్రయిస్తున్న వాహనాదారులు



"ఇటీవల లైసెన్స్ రెన్యువల్ కోసం హనుమకొండ జిల్లా చింతగట్టులోని ఆర్టీవో కార్యాలయానికి వెళ్లిన హనుమకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని వేలిముద్ర సరిగా పడటం లేదని, సాంకేతిక లోపం ఉందని నాలుగైదు సార్లు తిప్పారు. ఉద్యోగానికి సెలవు పెట్టి కార్యాలయం చుట్టూ తిరుగలేక ఓ దళారీని సంప్రదిస్తే రూ.2వేలు తీసుకుని అర గంటలో పని పూర్తి చేసి పెట్టారు."

"భూపాలపల్లి జిల్లా రేగొండకు చెందిన ఓ వ్యక్తి వాహన అనుమతి పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. అయితే ఏవేవో పత్రాలు లేవంటూ కార్యాలయం చుట్టూ తిప్పుకున్నారు. కానీ దళారిని సంప్రదించి రూ.2వేలు సమర్పించుకుంటే గంటల వ్యవధిలోనే సదరు ధ్రువపత్రం ఆ వ్యక్తి చేతికొచ్చింది."

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రవాణా, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. నిబంధనల ప్రకారం పౌరులకు అందాల్సిన సేవల్లో దళారులే చక్రం తిప్పుతున్నారు. ఏకంగా కొందరు అధికారులే వారితో కలిసి దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. 'ఏజెంట్లను కట్టడి చేశాం.. హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశాం' అని ఉన్నతాధికారులు చెబుతున్నా.. లెర్నింగ్ లైసెన్స్ మొదలు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ తదితర ధ్రువీకరణ పత్రాల వరకు దళారులుంటేనే పని అయ్యే పరిస్థితి ఉంది. సదరు ఫైల్‌పై మధ్యవర్తుల 'కోడ్' ఉంటేనే అధికారులు ఆమోద ముద్ర వేస్తున్నారంటే రవాణాశాఖ కార్యాలయాల్లో అవినీతి ఏ మేరకు పెచ్చుమీరుతోందో అర్థమవుతోంది. సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందుతున్నా.. దళారుల లైన్‌లో రాకపోతే కొందరు అధికారులు నిబంధనల పేరుతో వాహనదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటారనే చర్చ ఉంది. ఫైల్‌పై దళారుల కోడ్ ఉంటే క్షణాల్లో పనులు జరిగిపోతున్నాయని, కోడ్ లేని ఫైళ్లకు కొర్రీలతో వెనక్కు పంపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాహనాదారులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ క్రమంలో రూ.300కు అయ్యే పనికి రూ.3వేల వరకు ముట్టజెప్పాల్సి వస్తోంది. కొందరు అధికారుల కనుసన్నల్లోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో దళారుల దందా జోరుగా సాగుతోందని, అటు అధికారులు.. ఇటు మధ్యవర్తులు ఘరానా వసూల్‌రాజాలుగా వాహనదారుల జేబులు గుల్ల చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఆన్‌లైన్ ఉన్నా.. మితిమీరుతున్న దళారుల ప్రమేయం..

ఆర్టీఏ కార్యాలయాల్లో మితిమీరిపోతున్న దళారుల ప్రమేయాన్ని కట్టడి చేసేందుకు ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రతీ జిల్లా కేంద్రంలో ఆర్టీఏ కార్యాలయాలున్నాయి. 25జూలై 2020 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో సేవను ఆన్‌లైన్ చేశారు. ఏ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను చెల్లించి పొందవచ్చు. ఆర్టీఏలో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకొచ్చినా మామూళ్ల దందా ఆగడం లేదు. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్లు తిష్టవేసి ప్రతీ వాహన పనికి ఓ రేటు నిర్ణయించి.. ఘరానా వసూళ్లకు పాల్పడుతున్నా రనే ప్రచారం జరుగుతోంది. లెర్నింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్‌ఎల్‌ఆర్) నుంచి ఫిట్‌నెస్, ఫిట్‌నెస్ రెన్యువల్ వరకు ప్రభుత్వానికి చెల్లించే

మిగతా 7వ పేజీలో...

కోడ్ ఉంటే చాలు అంతా ఓకే..

దళారుల కోడ్ ఉన్న ఫైల్ వెళితే కాలు ఆర్టీవో అధికారులు ఇట్టే ఓకే చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఆర్టీవో కార్యాలయాల సమీపంలోనే ఆన్‌లైన్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని మరీ తిష్టవేస్తున్న దళారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టుగా హవా కొనసాగిస్తున్నారు. దళారులకు ఆర్టీవోలోని కొంతమంది అధికారులు ఓ ప్రత్యేక కోడ్‌ను కేటాయిస్తున్నారు. అలా ఫైల్‌పై సదరు దళారులు కోడ్‌ను చూసి పైస్థాయి అధికారి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అది ఏ మధ్యవర్తిదనేదానిపై అవగాహన ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఆ కోడ్‌తో వచ్చే ఫైళ్లను ఎలాంటి పరిశీలన చేయకుండా అధికారులు మమ అనిపిస్తారని, ఏ పని కోసం కార్యాలయానికి వెళ్లినా తొలుత ఆ కోడ్‌నే పరిశీలిస్తారట. ఆ కోడ్ ఫైల్‌పై లేదంటే ఇక ఫైల్ ముందుకు కదలదని, ఏవేవో కొర్రీలు పెడుతారని, ఎక్కడ లేని రూల్స్ చెప్పి తిప్పుకొంటారనే ఆరోపణలున్నాయి. ఒకవేళ అధికారులు చెప్పిన వాటిని సరి చేసుకొని వెళ్లినా మళ్లీమళ్లీ ఏదో కారణంతో ఫైల్‌ను పక్కన పెడతారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి
- ఆయన కృషి వల్లే అన్ని వర్గాలకూ న్యాయం
- రాజ్యాంగ దినోత్సవంలో మంత్రి సీతక్క



మంగపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మహనీయుడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అని, ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సీతక్క పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశ్నించేహక్కును రాజ్యాంగం రూపొందించిందన్నారు. రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అంబేద్కర్ అనేక కష్టనష్టాలు పడి భవిష్యత్‌తరాలకు ఇబ్బందులు కలగకుండా పలు చట్టాలను రూపొందించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ఎస్సీఎస్టీ అట్రాసిటీ సభ్యుడు జన్ను రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వల్లే నేనీ స్థాయికి..

మంగపేట (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే తాను మంత్రి స్థాయికి ఎదిగానని సీతక్క అన్నారు. మండలంలోని కమలాపురం, గంపోనిగూడెం, మంగపేట తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. కమలాపురంలో సీసీరోడ్డును ప్రారంభించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో కల్యాణలక్ష్మి, షాదీము బారక్ లబ్ధిదారులు 39 మందికి చెక్కులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొం దుతున్నారని అన్నారు. అంబేద్కర్ అందరి వాడని, రాజకీయంగా ఆయన పేరును వాడుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు, తహసీల్దార్ రవీందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి బసారి హరికృష్ణ, నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఎంపెల్లి వీరస్వామి, విగ్రహదాత చిట్టుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో...

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. కుమరంభీం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మారుమూల ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే అంబేద్కర్ కన్న కలలు సాకారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్, కన్నాయిగూడెం మాజీ జడ్పీటీసీ నామ కరంచంద్ గాంధీ, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు ఎమ్డీ. అఫ్సర్, ప్రధాన కార్యదర్శి వావివాల చిన్నఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, టౌన్ అధ్యక్షుడు సరకొప్పుల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు నవీన్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ, మాలమహానాడు రాష్ట్ర నాయకులు వేల్పుల సమ్మక్క, గోసుకుల్ల రాంబాబు, మదరి మధు, జిల్లా కన్వీనర్ కాళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన స్పెయిన్ దేశస్థులు



ఆలయ శిల్పకళా సంపద గురించి తెలుసుకుంటున్న విదేశీయులు

వెంకటాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని స్పెయిన్ దేశానికి చెందిన రోసీయో, అల్బర్ట్ సందర్శించారు. ముందుగా రామలిం గేశ్వరస్వామిని దర్శించుకొని అర్చకుల నుంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి గైడ్ ద్వారా ఆలయ విశిష్టత, చరిత్రను తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించారు.

మామునూరు ఎయిర్‌పోర్టు పనులు చేపట్టండి

కేంద్ర మంత్రికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి



సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రిని కలిసిన వరంగల్ ఎంపీ కావ్య

వరంగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు పనులను త్వరగా చేపట్టాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర విమానయన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎంపీ కావ్య కేంద్ర మంత్రిని కలిశారు. రాష్ట్రంలో నాలుగు ఎయిర్‌పోర్టులను ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఈ సందర్భంగా అన్నీ అనుమతులు ఉన్న మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా చేపట్టాలని ఎంపీ కోరారు. దీంతో కేంద్ర మంత్రి రామోహ్మన్ నాయుడు మాట్లా డుతూ.. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుకు అన్ని విధాలా అనుకూలంగా ఉందని, రోడ్డు కనెక్టివిటీ, మౌళిక వసతులు, భూ సేకరణ పూర్తి చేస్తే రెండేళ్లలో విమానాల రాక పోకలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో వరంగల్ విమానాశ్రయం కోసం అన్ని రకాల వసతులు కల్పిస్తామని, పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి వివరించారు.

రైతు సంక్షమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాల మండలం గోపాలపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఒడితల, గోపాలపురం, జడల్‌పేట, నైన్‌పాక, ఫైన్‌పాక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏకకాలంలో రూ. 2లక్షలు వ్యవసాయ రుణాలు మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో అది సాధ్యమైందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టే ప్రసక్తే లేదన్నారు. అనవరం ఉన్న చోట్లా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తున్న ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లిస్తోందని అన్నారు. రేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్రాంతి కానుకగా సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. దళారులకు ధాన్యాన్ని కట్టబెట్టి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హేమ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, నాయకులు గడ్డం కొమురయ్య, నక్క భాస్కర్, బండి భగవాన్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల మండలంలో..

టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరెడ్డిపేట, గుమ్మడ వెల్లి, కుందనపల్లి, ఏంపేడు, వెల్లంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెంటర్ ఇన్‌చార్జిలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, జిల్లా కార్యదర్శులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, వైనాల రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కనుమరుగుల సంపత్, కనుమరుగుల సదయ్య, మాదం కొమరయ్య, సంపత్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు




పరుగు పందెంలో దివ్యాంగులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో దివ్యాంగులకు మంగళవారం క్రీడా పోటీలు జరిగాయి. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్త్రీశిశు సంక్షేమ, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చగా కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చాలన్నారు. అందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని అన్నారు. శరీరం సహక రించకపోయినా ఎందులోనూ తాము తక్కువ కాదని దివ్యాంగులు ఆటల్లో పాల్గొని ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. దివ్యాం గులంతా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు కలెక్టర్ దివార, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదారాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్, సీఎస్ శాంతి కుమారితో కలిసి ఆయన మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో గతంలో అక్రమాలకు చోటుచేసుకున్నాయన్నారు. ఈసారి కఠినంగా వ్యవహరించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గోదాములు, మిల్లుల కేటాయింపు, నిల్వలు, రైతులకు ధాన్యం డబ్బులు, బోనస్ చెల్లింపులపై సీఎం అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఎస్‌వో శ్రీనిత్, డీఎం రాములు తదితరులు పాల్గొన్నారు. ములుగు నుంచి కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.




కాటారంలో ఎంపీడీవోతో మాట్లాడుతున్న ట్రెయినీ ఎస్వోలు

కేంద్ర సచివాలయ ట్రెయినీ ఎస్వోల పర్యటన

అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన

కాటారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో కేంద్ర సచివాలయ ట్రైనీ సెక్షన్ ఆఫీసర్లు మంగళవారం పర్యటించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్‌కు చెందిన కేంద్ర సచివాలయ సెక్షన్ అధికారులు అమిత్‌చౌదరి, అంకిత్‌గుప్తా, కృష్ణ టాప్పో, ప్రవీణ్ తాయల్, అనూప్‌సింగ్, అరవింద్‌కుమార్ సింగ్ చేరుకున్నారు. లెవల్-డీ శిక్షణలో భాగంగా కాటారం మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామిని అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా బుధవారం నుంచి పలు జీపీల్లో ఈ బృందం పర్యటించనుందని ఎంపీడీవో బాబు తెలిపారు.

కేంద్ర విధానాలపై సీఐటీయూ నిరసన



ఏటూరునాగారంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ శ్రేణులు

ఏటూరునాగారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఏటూరునాగారంలోని జాతీయ రహదారిపై మంగళవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, బీరెడ్డి సాంబశివ మాట్లాడుతూ కార్మికుల, రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టిన మోదీ సర్కారు కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌లను నోటిపై చేసి కార్మికుల హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. 61 సింగరేణి బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు.

వ్యవసాయ రంగంలో సబ్సిడీలను భారీగా తగ్గించడంతో రైతులు, ఆహార ఉత్పత్తిదారులు ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎమ్డీ. దావూద్, రత్నం రాజేందర్, పొదిల్ల చిట్టిబాబు, కొప్పుల రఘుపతి, గొంది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


రజిత (ఫైల్)

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన వివాహిత మహిళ ధరావత్ రజిత అదృశ్యమైనట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రజిత తన భర్త దారావత్ రమేష్‌తో ఈనెల 24న గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు.

దీంతో కుటుంబసభ్యులు బంధువుల ఇండ్లు, స్నేహితుల ఇండ్లలో వాకబు చేసినప్పటికి అచూకీ లభించలేదని చెప్పారు. ఈ విషయంపై రజిత తండ్రి బానోత్ లచ్చిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

- ఎన్నికల హామీలు నెరవేర్చకుండా విజయోత్సవాలా ?
- కేసీఆర్ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, మొదటి నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ వ్యాఖ్యానించారు. భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదివస్ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విజయోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం జరుపుకోవడం విడ్డూరమని అన్నారు. కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, రైతుబంధు, పెన్షన్ల పెంపు ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. భూపాలపల్లిలో ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి అనేక అభివృద్ధి చేశారన్నారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఒక్క రూపాయి కూడా నిధులు తేలదని విమర్శించారు. చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 29న తలపెట్టిన ప్రజాదివస్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో ఉండి కూడా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. స్థానికంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ చూపి అర్హులైన వారందరికీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్లెపు రఘుపతిరావు, మేకల సంపత్‌యాదవ్, పిన్‌రెడ్డి రాజిరెడ్డి, జాగృత్తి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కేసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని పెనుగొండ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ. 20 లక్షల ఉపాధి నిధులతో జీపీ భవనాన్ని మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం కేసముద్రం విలేజిలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆవరణలో ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో క్రాంతి, ఎఫ్‌పీవో చైర్మన్ సొల్లేటి జైపాల్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ఇనుగుర్తి : మండల కేంద్రం, లాలుతండాలో మంగళవారం సీసీ రోడ్ల ప నులను ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, గ్రామ అధ్యక్షుడు గంజి రాజేందర్‌రెడ్డి, చిన్నాల కట్టయ్య, కొట్టం రాము, తమ్మడపల్లి కుమార్, మీటు పాల్గొన్నారు.

జీపీ, అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

నెల్లికుదురు : హేమ్లతండాలో గ్రామ పంచాయతీ భవనం ,రత్తిరాంతండాలో అంగన్‌వాడీ భవనాలకు ఎమ్మెల్యే మురళీనాయక్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీపీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు నిధులు విడుదలచేసి నిర్మాణాలు చేపడుతుందన్నారు. ఎంపీడీవో బాలరాజు, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, బాలాజీనాయక్, జెల్ల వెంకటేష్, రావుల సతీష్, గుగు లోత్ మదన్, యాకూబ్ అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


పెనుగొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

దళారులను నమ్మవద్దు

గూడూరు : ఇందిరమ్మ ఇండ్ల పేరుతో వచ్చే దళారులను నమ్మి మోసపోవద్దని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. గూడూరు మండలంలోని లక్ష్మీపురంలో జీపీ రోడ్డు పనులకు, గూడూరులో జీపీ నూతన భవనానికి, లైన్‌తండాలో అంగన్‌వాడీ భవన సముదాయానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయా సమావేశాల్లో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఏవో అబ్దుల్ మాలిక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మాధవపెద్ది రమేషచందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి, చంటిస్వామి, రాసమల్ల యాకయ్య, రసూల్, నెక్కొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరేష్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి భీమా, పంచాయతీరాజ్ ఏఈ, డీఈలు పాల్గొన్నారు.

'లక్ష్మీనరసింహ శతకం' పుస్తకావిష్కరణ


లక్ష్మీనరసింహ శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేద పండితులు

జఫర్‌గఢ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జఫర్‌గఢ్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి 'శ్రీవేల్పుగొండ లక్ష్మీనరసింహ శతకం' పుస్తకావిష్కరణ జరిగింది. లక్ష్మీనర్సింహస్వామి మహిమలు, ప్రాశస్త్యంపై హుజురాబాద్‌కు చెందిన సాహితీవేత్త, రిటైర్డ్ తెలుగు భాషోపాధ్యాయురాలు డాక్టర్ దివిటి అంజనీదేవి శతక పద్యాలను రాసి పుస్తక రూపంలో ప్రచురించారు. పుస్తకాన్ని స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రచయిత్రి, భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు.

రచయిత్రి అంజనీదేవి మాట్లాడుతూ భక్తుల కొంగు బంగారంగా కల్పతరువై విరాజిల్లుతున్న శ్రీవేల్పుగొండ లక్ష్మీనరసింహస్వామి వారి ఆజ్ఞగా భావించి సంకల్ప బలంతో తాను ఓ భక్తురాలిగా ఆయన మహిమలపై శతక రచన చేశానన్నారు. కార్యక్రమంలో అర్చక వేద పండితులు రయ్యాల కృష్ణమాచార్యులు, పొడిచేటి శ్రీనివాసాచార్యులు, వెంకటాచార్యులు, హైస్కూల్ భాషోపాధ్యాయురాలు సిరికొండ సునీతాదేవి, లాకావత్ రవీంద్రనాయక్, భక్తులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో ఏకాదశి పూజలు

మహదేవపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర పుణ్యక్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏకాదశి పూజలు జరిగాయి.

భక్తులు భారీ సంఖ్యలో కాళేశ్వరం చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు చీర, సారె, కుంకుమ, పసుపుతో పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. శుభానందదేవి ఆలయం, సరస్వతిదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గులు వేసి లక్ష వత్తులతో దీపాలను వెలిగించారు. బ్రాహ్మణోత్తములను దీపాదానం అందజేశారు.

ప్రత్యేక పూజల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాతృమూర్తి జయశ్రీ పాల్గొన్నారు. అలాగే కాళేశ్వరంలోని ప్రధాన ఆలయం వద్ద కాలసర్ప నివారణ దోష పూజలు జరిగాయి.


కాళేశ్వరాయంలో పూజలో పాల్గొన్న భక్తులు

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి


మాధాపురంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం మాదవాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు మానుకోట పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ సంకా సిద్దాంత్.. వార్షిక పరీక్షల వరకు స్టూడెంట్స్‌కు అల్పాహారం అందించేందుకు రూ. 15 వేల చెక్కుతో పాటు ఆల్ఇన్‌వన్ స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రిని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలు విద్యనభ్యసిస్తుంటారని, వారిని దృష్టిలో పెట్టుకొని సిద్దాంత్ అల్పాహారం అందించేందుకు డబ్బులు, స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించటంతో పాటు ఎక్కువ మంది విద్యార్థులు 10 /10 జీపీఏ సాధించేలా చూడాలన్నారు. హెచ్ఎం సంకా బద్రినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్వో అప్పారావు, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చిరాంనాయక్, ఉపాధ్యాయులు స్నేహలత, నాగయ్య, రమాదేవి, పరమాత్మాచారి, బాబురెడ్డి, సుజాత, సౌభాగ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు వీరలక్ష్మి, కామాక్షి, శైలజ పాల్గొన్నారు.

కనీస సామర్థ్యాలు సాధించేలా చూడాలి

పాఠశాలలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి తరగతుల వారీగా కనీసం సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. హెచ్ఎం విత్తనాల సుధాకర్, ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, ఎంఈవోలు ఎం బుచ్చయ్య, లచ్చిరాంనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి కేజీబీవీలో..

గూడూరు : బ్రాహ్మణపల్లిలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను డీఈవో రవీందర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని డైనింగ్‌హాల్, వంటగదిలో ఉండే సరుకులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఎస్సెస్సీ విద్యార్థులు కష్టపడి చదువుకుని నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఆజాద్, గురుకుల స్పెషల్ ఆఫీసర్ సునీత పాల్గొన్నారు.

రేపటి నుంచి కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేయూ సోషియాలజీ, సోషల్‌వర్క్స్ విభాగం నేతృత్వంలో ఈనెల 28, 29 తేదీల్లో 'గ్లోబలైజేషన్ డెవలప్‌మెంట్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ :మ్యాపింగ్ ది ట్రాజెక్టోరీస్ ఆఫ్ సోషల్ ఇన్స్టిట్యూషన్ అండ్ ప్రాసెస్ ఇన్ కంటెంపరీ ఇండియా' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతోందని సోషియాలజీ విభాగాధిపతి సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ తెలిపారు. 28న ఉదయం వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగే ప్రారంభ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఓయూ రిటైర్డు ప్రొఫెసర్ కె.శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ ఎస్.రాములు, కె.వెంకట్‌నారాయణ, సి.గణేశ్, ఎస్‌కేడీ వర్సిటీ అనంతపూర్ నుంచి ప్రొఫెసర్ సీహెచ్. ఉమామోహన్, ఎస్వీ వర్సిటీ తిరుపతి నుంచి ప్రొఫెసర్ ఎం.హన్మంతరావు, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, యూజీసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ పాల్గొంటారని కన్వీనర్ తౌటం శ్రీనివాస్ తెలిపారు.

పాలకుర్తిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందాం

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న యశస్వినిరెడ్డి

పెద్దవంగర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మం గళవారం మండలంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో గంట్లకుంటలో రూ.4లక్షల వ్యయంలో సీసీ రోడ్డు, కొరిపెల్లిలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించడం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తొర్రూరు ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, ఎంపీడీవో వేణు మాధవ్, ఇరిగేషన్ ఏఈ కవిత, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మాజీ ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న, బ్లాక్ అధ్యక్షుడు హమ్యనాయక్, రంగు మురళిగౌడ్, గోపాల్, వెంకన్న, దుంపల శ్యామ్, సీతారామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పిస్తాం

తొర్రూరు రూరల్ : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు మండలం హరిపిరాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.12 లక్షలతో నిర్మించ తలపెట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. తొర్రూరు మండలం చింతపల్లి నుంచి కపూర్యతండ వరకు రూ.1.90 కోట్లతో నిర్మించే బీటీరోడ్డు, సోమారంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని చెప్పారు. నిర్ణీత కాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు.

కడియం రాజీనామా చేయాలి : రాజయ్య



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీ లు అని మాట్లాడే ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాజ్యాంగంపై గౌరవం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య డిమాండ్ చేశారు. రాజ్యాంగం అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘన్‌పూర్ మండల కేంద్రం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు శ్రమించి కడియంను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, కాంగ్రెస్‌లో చేరానని, ఎమ్మెల్యే పదవిలో ఉండే అర్హతలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు కనకం గణేష్, ఆకుల కుమార్, తాటికొండ సురేష్, కుంభం కుమార్, మార పల్లి ప్రసాద్, మాచర్ల రఘురాములు, గుర్రం శంకర్, దేవయ్య, ఏసుబాబు, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామి పవిత్రోత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్ ఘన్‌పూర్‌లోని తిరుమల నాథస్వామి పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి పవిత్ర ఆరోహణం, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర అదివాసం, నిత్య హోమం, సహస్ర నామ పారాయణం విష్ణు సహస్ర నామ పారాయణం చేపట్టారు. మంగళవారం ఆరాధన సేవా కాలం, నిత్య పూర్ణాహుతి, ద్వార తోరణ పూజ, అగ్ని ఆరాధన, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. బుధవారం పవిత్రోత్సవాల ముగింపును పురస్కరించుకుని 108 కలశాలతో శత ఘటాభిషేకం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, ఎం.రవీందర్, యాద శ్రీను, గోలి శ్రీను, డీసీసీ నేత కె.సతీష్, ఎస్. ఆంజనేయులు, నరేందర్, వికాస తరంగిణి కన్వీనర్ వి.తిరుమల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పవిత్రోత్సవ పూజలు చేస్తున్న భక్తులు



రాగి రేకుపై లిఖించిన బైబిల్ పుస్తకం

- రాగి రేకులపై రాసిన విశ్రాంత ఉద్యోగి
- అంబేద్కర్ అంటే ఎంతో అభిమానమంటున్న గోపాల్

ప్రత్యేకం

నాడు బైబిల్..
నేడు రాజ్యాంగం



రాగి రేకుపై రాసిన రాజ్యాంగం

హనుమకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపెల్లి గోపాల్... ఆయన వయసు 77ఏళ్లు. ఆయనో విశ్రాంత ఉద్యోగి.. శాశ్వతంగా నిలిచిపోయే పని ఏదో ఒకటి చేయాలన్న తపనతో ఎంతో శ్రమించారు. ఆ శ్రమకు ప్రతిరూపాలే రాగి రేకులపై రాసిన రాజ్యాంగం, బైబిల్ పుస్తకాలు. వరంగల్ రాంకీ విల్లాలో నివాస ముంటున్న వడ్డెపల్లి గోపాల్ కేఎంసీకి ఎదురుగా గల ఆంగంపేట. వైద్యఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. ఆయనకు భార్య, ముగ్గు రు కుమారులు, ఒక కూమార్తె ఉన్నారు. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇంట్లో ఊరికే కూర్చోవడం ఇష్టం లేక.. పుస్తకాలు చదవడంతో కాస్త కాలక్షేపం చేసినా ఏదో ఒకటి సాధించాలన్న తపనతో ఆయన గతంలో రాగి రేకులపై బైబిల్ రాశారు. అదే స్ఫూర్తితో తాజాగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కూడా పూర్తి చేశారు.

బైబిల్‌కు రెండేళ్లు.. రాజ్యాంగానికి ఏడు నెలలు

నిత్యం బైబిల్ చదవడం అలవాటు ఉన్న గోపాల్‌కు రాగి రేకులపై బైబిల్ రాయాలనే ఆలోచన వచ్చింది. 2017లో రాయడం మొదలు పెట్టగా 2019లో దాన్ని పూర్తిచేశారు. ఆయన బైబిల్‌ను రాసేం దుకు 36 గేజ్ (మందం) కలిగిన రాగి రేకులను ఎంచుకున్నారు. పేపర్‌లాగానే పలుచగా ఉండడమే కాక బరువు తక్కువగా ఉండి , రాయడానికి కూడా అను వుగా ఉండే ఆ రాగి రేకులపై రాయడానికి ఇంక్ అయిపోయిన బాల్‌పెన్‌ను ఉపయో గించారు. రోజుకు ఏడు గంటల పాటు శ్రమించి బైబిల్ రాయడం పూర్తి చేశారు. మొత్తం 3,00648 అక్షరాలు, 1050 పేజీలు, 53 కేజీల బరువున్న పుస్తకాన్ని రాయడానికి రూ.లక్ష ఖర్చు చేశారు. అది పూర్తయిన తర్వా ఇలాంటి మరో పుస్తకాన్నే రాయాలనుకుని ఆ ఆలోచనకు కార్యరూపమిచ్చారు. అయితే తనకు అంబేద్కర్‌పై ఉన్న అమితమైన అభిమానంతో ఓ దేశ పౌరుడిగా భారత రాజ్యాంగాన్ని రాగిరేకులపై రాయాలని నిర్ణయించుకున్నారు. పైగా రాజ్యాంగం రాసి ఈ ఏటికి 75 సంవత్సరాలు పూర్తవుతుండడంతో తన ఆలోచనకు కార్య రూపం ఇచ్చారు. గతంలో బైబిల్ రాసిన అనుభవంతో ఈ ఏడాది మార్చిలో మొదలు పెట్టి నవంబరులో మొదటి వారంలో పూర్తిచేశారు. తెలుగులో రాసిన ఈ రాజ్యాంగం 210 పేజీల్లో పూర్తవగా.. పుస్తకం బరువు 18 కిలోలుంది. దీని కోసం రూ.50 వేలు ఖర్చు చేశారు.

ఓపిక ఉంటే మరో పుస్తకం రాస్తా : గోపాల్



తనకు వయసు మీద పడిందని, ఇలాంటి పుస్తకం రాయాలనే ఉత్సాహం ఉన్నా శరీరం సహక రించాలని, ఓపిక ఉంటే భవిష్యత్తులో రాగిరేకులపై ఇలాగే మరో విశిష్టమైన పుస్తకం రాస్తానని గోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బృహత్ గ్రంథాన్ని రాయడానికి ప్రయత్నిస్తానన్నారు. ఇప్పటికే తాను రాగి రేకులపై రాసిన రెండు గ్రంథాలకు మంచి పేరు వచ్చిందని, ఇవి పూర్తిచేయడానికి తనకు కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారని, మిత్రులు, శ్రేయో భిలాషులు ఎంతగానో మెచ్చుకోవడం ఆనందంగా ఉంది అని గోపాల్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మైలారం తండా..
ఉద్యోగుల అడ్డా

అటెండర్ నుంచి కస్టమ్స్ అధికారి వరకు.. ప్రతీ రెండిళ్లకు ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా విధులు



మైలారం గ్రామం

పాలకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడు, భాగవత గ్రంథ కర్త బమ్మెర పోతన, వాల్మీకి మహర్షి లాంటి మహాకవులు జన్మించిన గడ్డ. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నడియాడిన పోరాటాల పురిటి గడ్డ. అలాంటి ప్రత్యేకతలు సంతరించుకున్న పాలకుర్తి ప్రాంతంలో 1945కు ముందే గుగులోతు హరిలాల్ అనే వ్యక్తి ఆధ్వర్యంలో మైలారం తండా ఏర్పాటైంది. నిజాం కాలం కావడంతో గిరిజనులు చదువుపై ఆసక్తి చూపలేదు. చదువుకోవాలంటేనే అందరు భయపడేవారు. అయినా భయపడకుండా తండా నుంచి విస్నూరు గ్రామానికి నడిచి చదువుకోసం వెళ్లిన ఒకే ఒక్కడిగా హరిలాల్‌కు పేరుంది. ఈ తండాలో మొత్తం 150 ఇళ్లుండగా.. వెయ్యి మంది జనాభా.. 600మంది ఓటర్లున్నారు. ఈ మైలారం తండా 1994లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది.ఇక్కడ ప్రత్యేకతేంటంటే ఈ కుగ్రామంలో ప్రతీ రెండిళ్లకు ఓ ఉద్యోగి ఉన్నాడు. తండా నుంచి చదువు కోసం వెళ్లిన తొలి విద్యార్థిగా హరిలాల్ కుమారుడు ఇందల్ నాయక్ ఆనాడు హెచ్ఎస్‌సీ వరకు చదువుకొని 1967లో పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించి ఆ తండా నుంచి మొట్ట మొదటి ఉద్యోగిగా పేరుతెచ్చుకున్నారు. ఇక ఇందల్ నాయక్ కుమారుడు హరికృష్ణ నాయక్ కేంద్ర సర్వీసులో ఉన్న కస్టమ్స్ అఫీసర్‌గా డిల్లీలో పని చేస్తుండగా, అదే తండాకు చెందిన మరో ఉద్యోగి మోహన్‌నాయక్ డిల్లీలో డ్రగ్ఇన్‌స్పెక్టర్ గా పని చేస్తున్నారు. మరొకరు సీఆర్‌పీఎఫ్ ఉద్యోగిగా.. పలువురు ఇంజనీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులుగా, రైల్వే ఉద్యోగులుగా, లాయర్లుగా కొలువులు నిర్వహిస్తుండటంతో పాటు విద్యుత్ శాఖ, బ్యాంకులు, ఎక్సైజ్ శాఖల్లో పలు ఉద్యోగాల్లో ఉన్నారు.

వీరే కాదు సుమారు 20మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మరో ఇద్దరు అమెరికాలో ఉద్యోగులుగా ఉన్నారు. వీరందరినీ ఆదర్శంగా తీసుకొని మరో 40 మంది పలు ప్రైవేటు కంపెనీల్లో పెద్ద స్థాయి ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. ఇలా మైలారం గ్రామానికి చెందిన పలువురు వివిధ ఉద్యోగాల్లో తమతమ స్థాయిల్లో మైలారం సత్తా చాటుతున్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం

డాక్టర్ సంజయ్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్



మారుమూల తండా అయిన మైలారం తండా నుంచి కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివి, హైదరాబాద్‌లోని మెడికల్ కళాశాలలో పీజీ చేశా. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా. నాకు జన్మనిచ్చిన మైలారం, పాలకుర్తి మండలానికి చెందిన పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తా.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివా

హరికృష్ణ నాయక్, కస్టమ్స్ అధికారి, ఢిల్లీ



ప్రభుత్వ పాఠశాలల్లో చదివా. ఉట్నూరు ఏపీ ఆర్‌జేసీలో ఇంటర్ పూర్తిచేశా. ప్రస్తుతం డిల్లీలో కస్టమ్స్ అధికారిగా పని చేస్తున్నా. ప్రస్తుతం మా కుటుంబం తరపున గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నా. ఇటీవల ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలకు మా సొంత భూమిని ఇచ్చాం. ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి కూడా సహకరించాం. మా తాతల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని గ్రామ పంచాయతీకి దానంగా ఇచ్చాం.

చదువుకోవడానికి విస్నూరుకు నడిచి వెళ్లా..

గుగులోతు ఇందల్ నాయక్, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి



ఆరోజుల్లో తండాలో ప్రభుత్వ పాఠశాల లేదు. నాలుగు కిలోమీటర్ల దూరంలోని విస్నూరు నడిచి వెళ్లి చదువుకున్నా.. నాడు పాలకుర్తిలో ఎస్సెస్సీ ఆ తర్వాత జనగామలో హెచ్ఎస్‌సీ వరకు చదివా. 1967లో పోస్టల్ శాఖలో నౌకరీ దొరికింది. ఈ తండా నుంచి తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించా. 2005లో ఉద్యోగ విరమణ చేశా. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నా.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణాలు



ములుగురోడ్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు



మట్టెవాడ వేణుగోపాలస్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు



మడికొండలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

వరంగల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మంగళవారం పలు దేవాలయాల్లో సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా శ్రీవేంకటేశ్వ స్వామి దేవాలయాల్లో అభిషేకాలు, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో భగవద్గీత పారాయణాలు నిర్వహించారు. ములుగు రోడ్‌లోని శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవాలయంలో వందలాది మంది దంపతులు వ్రతాలను ఆచరించుకున్నారు. ఎంజీ రోడ్‌లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, దత్తపురంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. జేపీఎన్‌రోడ్డులోని గీతాభవన్‌లో శ్రీవేంకటేశ్వర స్వామికి, బట్టల బజార్‌లోని శ్రీబాలానగర్ వేంకటేశ్వరస్వామికి, డాక్టర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామికి, దత్తక్షేత్రంలోని శ్రీవరద దత్తత్రేయ స్వామికి, మురళీ కృష్ణ మందిరంలోని శ్రీకృష్ణ భగవానుడికి, ఆకారపు వారి గుడిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామికి విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణాలతో పాటు ఎస్‌జీఎస్ భగవద్గీత పారాయణం నిర్వహించారు.

మట్టెవాడ, (ఆంధ్రజ్యోతి): వరంగల్ బట్టల బజారులోని బాలానగర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శ్రీరంగం శ్రీనివాసాచారి సత్యనారాయణస్వామి వ్రతం గురించి వివరించారు. సాయంత్రం శ్రీ భగవద్గీత పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, శ్రీవారి ఉత్సవ సేవా సమితి, శ్రీ వెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవాలయంలో..

వరంగల్ మట్టెవాడ వేణుగోపాలస్వామి ఆలయంలో రమాసహి త సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు రామాచార్యులు, కృష్ణమాచార్యులు, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇరుకుల రమేశ్ పాల్గొన్నారు.

మడికొండ (ఆంధ్రజ్యోతి): మడికొండలోని చారిత్రక మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలలో భాగంగా మంగళవారం సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. రామాలయంలో సీతారామచంద్రస్వామి వారికి విశేష అర్చనలు చేశారు. చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజు, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీవోలో.. ఘరానా వసూళ్లు!

(5వ పేజీ తరువాయి)

రుసుంతో పాటు దళారుల చేతులు కూడా తడపాల్సి వస్తోందని, ఈ క్రమంలో నాలుగైదు రెట్ల సొమ్ము ఇవ్వాల్సి వస్తోందని చెబుతున్నారు. నేరుగా ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి కార్యాలయాల్లోకి వెళ్తే ఏవేవో సాకులు చెబుతున్న అధికారులు రోజుల తరబడి తిప్పుకుంటున్నారని, దీంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు.

హవా చాటుతున్న దళారులు

నిత్యం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల నుంచి 1,500 నుంచి 2వేలకు పైగా వివిధ పత్రాలను జారీ చేస్తున్నారు. అయితే ఆర్టీవోల్లోని కొందరు అధికారులతో ముందే చేసుకున్న ఒప్పందం ప్రకారం దళారులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల డ్రైవింగ్ లైసెన్సు కావాలంటే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్లాట్ బుకింగ్‌కి తొలుత రూ.450, తదుపరి మూడు నెలల కాల పరిమితి తరువాత మళ్లీ స్లాట్ బుకింగ్ రూ.1,250 రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా రూ.1700 ఖర్చు అవుతుంది. కానీ, దళారులు ఇదే లైసెన్స్ ఇప్పించేందుకు వాహనాదుల నుంచి రూ.4,500 నుంచి రూ.6,000 వరకు దండుకుంటున్నారు. అలాగే కొత్తగా రిజిస్ట్రేషన్ నెంబర్ తీసుకోవాలంటే ఆన్‌లైన్‌లో కేవలం రూ.450 చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకొని వెళితే సరిపోతుంది. కానీ, దళారులను ఆశ్రయిస్తే రూ.2,000 నుంచి రూ.4,000 వరకు వాహనాన్ని బట్టి వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. లైసెన్సుల జారీ, రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్, సీసీ బదిలీ, లైసెన్స్ రెన్యువల్‌కు వచ్చే వారి నుంచి ప్రతీ పనికి ఓ రేటు ఫిక్స్ చేసి వాహనాదారుల నుంచి భారీగానే వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దళారుల నుంచి రోజువారీగా వచ్చే ఫైళ్ల వివరాలను కార్యాలయంలోని ప్రత్యేకంగా ఓ సిబ్బంది నమోదు చేసుకుంటారు. ఎవరెన్ని ఫైల్స్ తీసుకొచ్చారో నోట్ చేసుకుని, సంబంధిత అధికారికి తెలిపి.. ఆ రోజు కలెక్షన్లను దళారులు సదరు సిబ్బందికి కార్యాలయం ముగిసే సమయంలో అప్పగిస్తారనే ప్రచారం ఉంది.

పని, ఫైల్‌ను పత్రాలను బట్టి అధికారులు ముందే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వాటా చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజూ రూ.50లక్షల నుంచి రూ.1కోటి వరకు సీజన్ బట్టి దళారులు, అధికారుల మధ్య చేతులు మారుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

ఓవర్ వసూల్..

వాహనాల ఓవర్‌లోడ్ అంటే చాలు అధికారులకు పండగేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమకు అందిన సమాచారమైనా, లేదా ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడిన అదనపు వాహనాలపై అక్రమంగా వసూల్ చేస్తూ.. వాహనాలను వదిలేస్తుంటారనే ప్రచారం జరుగుతోంది. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం, ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట, వాజేడు ప్రాంతాల్లోని గోదావరి నుంచి రోజూ వందల సంఖ్యలో ఇసుక లారీలు వస్తుంటాయి. ఆ రెండు జిల్లాలతో పాటు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలు దాటి ఇసుక లారీలు వెళ్లాల్సి ఉంటుంది. ఇక ఓవర్ లోడ్‌తో లారీ దొరికితే ఇక బుక్ అయినట్టే. అదనపు టన్నుకు రూ.1,000 చొప్పున.. ఎన్ని టన్నులు అధికంగా ఉంటే అన్ని రూ.వేలు అధికారులకు సమర్పించాల్సి ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాలో కొందరు సిబ్బంది దళారులతో కలిసి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హనుమకొండ, వరంగల్ జిల్లా పరిధిలోని గుడెప్పాడ్, ఊరుగొండ, ఆరెపల్లి, వంగపహడ్, పలివేల్పుల రింగు రోడ్డుపై ఓవర్ లోడ్ లారీని ఆపి వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాగే మహబూబాబాద్, వరంగల్ జిల్లాల మీదుగా గ్రానైట్, మట్టి భారీగా తరలిపోతుండగా.. ఇందులో కూడా అదనపు వసూళ్లే జరుగుతున్నాయని ప్రచారం. ఇక ఫిట్‌నెస్ లేని వాహనాలు పట్టుబడితే రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారని, నిబంధనల ప్రకారం ఆ వాహనాలకు జరిమానా విధిస్తే రూ.30వేలపైనే ఉండటంతో వాహనదారులు కూడా ఆమ్యామ్యలు ఇచ్చేందుకే మొగ్గు చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఆర్టీవో కార్యాలయాల్లో దళారులదే రాజ్యం నడుస్తోందని, అధికారులు కూడా అందిన కాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనుల పండువగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీక బహుళ ఏకాదశి మంగళవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేం ద్రశర్మ ఆధ్వర్యంలో నిత్య పూజ అనంతరం డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, దీప్తి దంపతుల సౌజన్యంతో విజయవాడ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 21 రకాల పుష్పాలతో లక్ష నామాలతో వైభవంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఒక వైపు పూజలు జరుగుతుండగా ఆలయ నాట్య మండపంలో మహి ళలు లలితా సహస్ర పారాయణం, శివనామ సంకీర్తనలు ఆలపించారు. ప్రదోషకాల సమయంలో ఆలయ ప్రాంగణంలో ముఖ్యంగా నందీశ్వరుడి వద్ద ప్రత్యేక దీపాలను వెలిగించారు. మంగళవారం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆలయాన్ని సందర్శించారు.

కోటలో ముగిసిన బొడ్రాయి వేడుకలు

మొక్కులు చెల్లించుకున్న రాజకీయ ప్రముఖులు



మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలా వరంగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా ఖిలావరంగల్‌లో బొడ్రాయి 5వ, వార్షికోత్సవాన్ని బొడ్రాయి వేడుకలు ఘనంగా ముగిశాయి. మంగళవారం భూలక్ష్మి, మహాలక్ష్మి, నాభిశిల, బొడ్రాయి గ్రామదేవతకు అర్చకుడు పాలకుర్తి సుబ్రహ్మణ్యం విశేష పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో 34, 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం, ప్రధాన కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి గజ్జెల శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ తోటకూరి నర్సయ్య, పుప్పాల రాజేందర్, బొళ్ల సారంగపాణి, నర్సింహస్వామి, మిట్టపెల్లి వెంకటేశ్వర్లు, ఎడ్ల కృష్ణమూర్తి, నరిమేటి లింగమూర్తి, బజ్జూరి ప్రసాద్, పొన్నం బాబురావు, అంకాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి ఆర్థిక సాయం చేయాలి

16వ ఆర్థిక సంఘం సమావేశంలో మేయర్ సుధారాణి



మాట్లాడుతున్న గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించాలని మేయర్ గుండు సుధారాణి 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వారసత్వ ప్రదేశంగా వరంగల్ నగరానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. వరంగల్ నగరం మరింత అభివృద్ధి చెందాలంటే ఆర్థిక వనరులు అవసరమన్నారు. ఇటీవల 42 విలీన గ్రామాలతో వరంగల్ గ్రేటర్‌గా అవిర్భవించిందని 407.7 చదరపు కిలో మీటర్ల వరకు విస్తరించిందన్నారు. 2024 సంవత్సరం వరకు నగర జనాభా 10.48 లక్షలకు పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ అతి పెద్ద నగరంగా గుర్తింపు పొందిందన్నారు.

వరంగల్‌లో భూగర్భ డ్రైయినేజీ అవసరమని, డీపీఆర్ సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ. 4,170 కోట్లకు అనుమతి ఇచ్చిందన్నారు.

వరంగల్ నగరం ఇంకా సమగ్ర అభివృద్ధి చెందాలంటే మరో రూ. 5000 కోట్లు అవసరమన్నారు. వరంగల్ నగరంలో ప్రతీ రోజు 450 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని వ్యర్థాలను శుద్ధి చేయడానికి బయో మైనింగ్ ప్లాంట్ అవసరమన్నారు. వరంగల్ నగరం అభివృద్ధి చెందాలంటే 16వ ఆర్థిక సంఘం చేతుల్లోనే ఉందని కావాల్సిన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సందడిగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

హాజరైన 400 మంది అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలు హనుమకొండ జేఎన్ఎస్‌లో సందడిగా ప్రారంభమైయ్యాయి. మంగళవారం జేఎన్ఎస్‌లో నిర్వహించిన సబ్ జూనియర్స్ బాల బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కొదురుపాక సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో పథకాలను సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమ శిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఊర యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీల్లో 50, 100, 300, 400, 600ల మీటర్ల పరుగు పందం, కిడ్స్ జావెలిన్‌త్రో, లాంగ్ జంప్ క్రీడాంశాలలో ఎంపికలు జరిగాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 400 మంది అథ్లెట్లు పాల్గొన్నారన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు డిసెంబరు 1 నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మూగల కుమార్ యాదవ్, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు గంగిశెట్టి మనోజ్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణ మూర్తి, మహేందర్, రజినీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు

మహిళల అభ్యున్నతే ధ్యేయం: మంత్రి సీతక్క

గణపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆమె హాజరయ్యారు. వెళ్తుర్లపల్లి క్రాస్‌రోడ్ నుంచి కొండాపూర్ మీదుగా రూ. 15కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ చేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, పరిశ్రమలు, గేదెల పెంపకం తదితర పథకాలతో ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిందన్నారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం అని చెప్పి కనీసం పదేళ్లలో ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ చేపడుతున్న పథకాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. భూపాలపల్లి, ములుగు రెండు నియోజకవర్గాలు తనకు రెండు కళ్లలాంటివని ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు సహకారంతో కోటగుళ్లు, రెడ్డిగుడి, పాండవులగుట్ట, బుగులోని వెంకన్న ఆలయం, గణపురం రిజర్వాయర్‌ను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు గాంధీనగర్ గుట్టలను ఆక్రమిస్తే ఇండస్ట్రీయల్ కారిడార్, విద్యాలయాల హబ్‌లకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భూపాలపల్లిలో మహిళా సమాఖ్య భవనానికి రూ. 5కోట్లు మంజూరు చేశామన్నారు. గణపురం మండలానికి కూడా మహిళా సమాఖ్య భవనానికి రూ. కోటి మంజూరు చేయాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, వైస్ చైర్మన్ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్లు గండ్ర సత్యనారాయణరెడ్డి, కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, మాజీ వైస్ ఎంపీపీ అశోక్, కాంగ్రెస్ నాయకులు చోటేమియా, శివశంకర్, రాజమౌళి, శ్రీనివాస్, కావటి రవి, మలహల్‌రావు, సంగయ్య, దేవేందర్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు.. మనోవికాస కేంద్రాలు

గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు మనోవికాస కేంద్రాలు కావాలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని చల్వాయి గ్రామంలో రూ.12లక్షల వ్యయంతో నూతన అంగన్‌వాడీ కేంద్రం-4 భవనానికి మంత్రి సీతక్క జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో మొదటిదశలో రూ.2కోట్ల16లక్షల నిధులతో 18 నూతన అంగన్‌వాడీ భవనాలను నిర్మించబోతున్నామని, అదేవిధంగా ఆయా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతుల కోసం రూ.91లక్షల72వేల బడ్జెట్ మంజూరు చేసినట్టు తెలిపారు. దీంతో మొత్తం రూ.3కోట్ల7లక్షల72వేలను జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, అభివృద్ధి కోసం మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి కూచన శిరీష, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సఖి, డీసీపీయూ, సీహెచ్ఎల్, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చల్వాయి గ్రామంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో కూలీలుగా పనిచేసిన వారిని మంత్రి సీతక్క కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి సన్మానించారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎస్ఆర్ నిధులు, మౌరిటెక్ ఐటీ సంస్థ సౌజన్యంతో పది కంప్యూటర్లతోపాటు కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు .మహేందర్‌జీ, సంపత్‌రావు, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గణపురం మండలం వెళ్తుర్లపల్లి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ. కోటితో డిగ్రీ కళాశాల నుంచి సామాజిక ఆస్పత్రి వరకు రోడ్డు నిర్మాణ పనులకు, చేపల మార్కెట్ నుంచి సాయిబాబా ఆలయం వరకు రోడ్డు మరమ్మతు పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. భారత రాజ్యాంగ 75వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలు, అధికారులతో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జీపీ కార్మికులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, ఎమ్డీ అయూబ్‌ఖాన్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నిటినీ నెరవేరుస్తాం

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీటిని కచ్చితంగా అమలు చేస్తోందని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామ శివారులో జాతీయ రహదారి నుంచి సీఆర్పీఎఫ్ బెటాలియన్ వరకు రూ.35లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులు, రూ.50లక్షల నిధులతో చేపట్టిన అంతర్గత సీసీ పనులు, ఇంచర్ల గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు మంత్రి సీతక్క కలెక్టర్ .దివాకర, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కొన్ని పథకాలను ఇప్పటికే అమలు చేస్తోందని, రానున్నరోజుల్లో రైతుబంధు, రైతుభరోసా, మహిళలకు రూ.2,500, పింఛన్ పెంపు పథకాలు అమలవుతాయని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడం కొందరికి నచ్చడంలేదని, పేద మహిళలు ఆర్థికంగా నష్టపోకుండా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ జనవరి మాసం నుంచి సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. రానున్నరోజుల్లో ఇంచర్ల గ్రామంలో రూ.5కోట్ల నిధులతో జిల్లా సమాఖ్య భవనాన్ని నిర్మిస్తామని అన్నారు. భవన, రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, గ్రామస్థులతో మంత్రి సీతక్క ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉపాధిహామీ పథకంలో భాగంగా వందరోజులు పూర్తిచేసుకున్న లబ్ధిదారులు, గ్రామపంచాయతీ సిబ్బందిని మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, డిప్యూటీ కమాండెంట్ ఎన్‌పి.రజిత, అసిస్టెంట్ కమాండెంట్ దామి నారాయణ, సుబేదార్ మేజర్ మణిబాబు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రహీం, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధిహామీ లబ్ధిదారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. ములుగు జిల్లాకేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, సహకార సంఘం చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, వైస్‌చైర్మన్ మర్రి రాజుతోపాటు కాంగ్రెస్‌పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

మహదేవపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ జిల్లాలో ఐదు మండలాకు కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్‌రావు, పలిమెల మండలాల్లో 12 అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు, 8 గ్రామ పంచాయతీల కొత్త భవనాలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో రూ. రూ. 3.10 కోట్లు మంజూరయ్యాయి.

కాటారం మండలానికి రూ.1.66 కోట్లు

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ఈజీఎస్ నిధులు రూ.1.66కోట్లు మంజూరయ్యాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో అంగన్‌వాడీ కేంద్రాలు, జీపీ కార్యాలయాలు, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు మంజూ రైనట్లు అధికారులు మంగళవారం తెలిపారు. కాటారం గ్రామపం చాయతీ పరిధిలోని పలు వాడల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం కోసం రూ.54 లక్షలు, రేగులగూడెం, శంకరంపల్లి, అంకుసాపూర్, ధర్మసాగర్ జీపీల కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.80లక్షలు, చిద్నెపల్లి, లక్ష్మీపూర్, దేవరాంపల్లి, గుండ్రాత్‌పల్లి అంగన్వాడీ కేంద్రాల భవనాలకు రూ.32లక్షలు మంజూరయ్యాయి.

ఉద్యాన అధికారి పరిశీలన

మహాముత్తారం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌతుపల్లి గ్రామ సమీపంలో సమీకృత వ్యవసాయ క్షేత్రంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి సంజీవ్‌రావు మంగళవారం బీరకాయ పంటను పరిశీలించారు. రైతులు .సదాశివ్, గట్టయ్యకు పలు సూచనలు చేశారు. పంటను కాపాడుకోవడానికి పాటిం చాల్సిన జాగ్రత్తలు వివరించారు. రైతులు కూరగాయలు, పళ్ల తోటలు, పూలతోటలు వేసుకోవాలంటే తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ ఉద్యాన అధికారి వీణ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు

మల్హర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయిను విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కాటారం సీఐ నాగార్జునరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్హర్ మండలంలోని కొయ్యూర్, కొండంపేట, ఇప్పలపల్లి గ్రామాలకు చెందిన ఏడుగురు యువకులు గంజాయిని ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్టు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. వారి నుంచి 1.54 కాగ్స్ గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన వారిలో ఎస్సై నరేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ హరి, రఘు, సుధాకర్, సాగర్, నరేష్, మురళి, సురేష్, హోంగార్డు మల్లేష్ తదితరులు ఉన్నారు. నిందితుల వ్యక్తిగత వివరాలను పోలీసులు వెల్లడించలేదు.



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ

న్యూస్ రీల్

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ రాహుల్

గణపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఎ మండలంలోని అప్పయ్యపల్లిలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ట్యాబ్ ఎంట్రీల్లో ఆలస్యం జరగకుండా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అప్పుడే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ కుమార్ తదితరులు ఉన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

• సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కాకతీయఖని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ క్రీడా మైదానంలోని సీఈఆర్ క్లబ్ వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కంపెనీ లెవల్ క్యారమ్స్, చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులు మంచి ప్రదర్శన కనబరిచి కోలిండియాలో సింగరేణి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు.

యాదవ సంఘం కమిటీ ఎన్నిక

కాటారం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో అఖిల భారత యాదవ మహాసభ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. సంఘం డివిజన్ అడహక్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రయ్య, అబ్బినవేని ఐలయ్య, ఆత్మకూరి కుమార్‌యాదవ్, గడవేన దేవేందర్, తొట్ల శ్రీశైలం, మొగిలి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కల్కి కొమురయ్య కురుమ, అధ్యక్షుడిగా సిద్ది శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా కాటవేన లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా పర్శవేన రాజయ్య, కోశాధికారిగా సిద్ది మనోజ్, సహాయ కార్యదర్శిగా కల్కి సమ్మయ్య, ప్రచార కార్యదిర్శిగా గంగుల సతీష్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత కాటారం

కాటారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కాటారం గిరిజన సంక్షేమ గురుకులం విద్యార్థుల జట్టు ప్రథమస్థానం సాధించింది. టోర్నమెంట్‌లో 25జట్లు పాల్గొనగా ట్రైబల్ వెల్ఫేర్ అండ్ బాల్ అకాడమీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో తమ సత్తా చాటారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. విజేత జట్టులోని విద్యార్థులను ప్రిన్సిపాల్ లాల్, వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, అధ్యాపకులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

శాంతి భద్రతల పరిరక్షణే ప్రధానం : డీఎస్పీ

చిట్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రత పరిరక్షణే పోలీసు సిబ్బందికి ప్రధానమని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా ఆయన మంగళవారం సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి మండలంలో ఎక్కువగా నమోదయ్యే కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, కోర్టు విధులు, మొబైల్ పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, షీ టీమ్స్ పనితీరునుపై చర్చించారు. సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గ్రామాల్లో సీసీకెమెరాల ఏర్పాటు, ఉపయోగాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. భూతగాదాల్లో జోక్యం చేసుకోవద్దని ఆదేశించారు. ఆయన వెంట సీఐ మల్లేష్, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షాఖాన్ ఉన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక ఉపాధ్యాయుడూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని టీఎస్సీపీఎస్ఈయూ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎం.డి.దిల్షాద్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిగా కొలిపాక వెంకటస్వామిని ఖరారు చేసినట్టు తెలిపారు. ఆయన గెలుపుకోసం కృషి చేయాలని కోరారు.

విద్యార్థులను అప్పగించిన పోలీసులు

మొగుళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి తప్పించుకుని వస్తున్న ఇద్దరు విద్యార్థులను స్థానిక పోలీసులు గుర్తించి మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరకాల పట్టణంలోని శారద విద్యాలయంలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సోమవారం రాత్రి హాస్టల్ నుంచి గోడదూకి పరకాల నుంచి కాలినడకన మొగుళ్లపల్లిలోని తమ బంధువుల ఇంటికి బయల్దేరారు. ఈక్రమంలో బ్లూకోర్టు సిబ్బంది సారంగపాణి, రవి రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా రంగాపురం గ్రామంలో వారు కనిపించారు. దీంతో విద్యార్థుల నుంచి వివరాలు సేకరించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. మంగళవారం ఎస్సై అశోక్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి క్షేమంగా అప్పగించారు. ఏఎస్సై వెంకటరత్నం, సిబ్బంది సారంగపాణి, రవిని ఎస్సై అభినందించారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దు : టీఆర్‌టీఎఫ్

భూపాలపల్లిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించొద్దని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పెండెం మధుసూదన్, కూచనపల్లి రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు అనేక రికార్డులు పంపించడం, బోధనేతర కార్యక్రమాలకు పురమాయించడం వంటివి చేయకూడదని పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొనేలా చేయడం, అరకొర వసతులతో, నియంత్రణ వ్యవస్థలో రాజకీయ జోక్యంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి విలువైన సమయాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు.

బుగులోని జాతర ఆదాయం రూ.12 లక్షలు

రేగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన బుగులోని వెంకటేశ్వరస్వామి జాతర ఆదాయం రూ. 12 లక్షలు సమకూరిందని చైర్మన్ రొంటాల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం జాతర ఆదాయం 12లక్షలు రాగా నిర్వహణ ఖర్చు, దేవాదాయ శాఖ వాటా పోను రూ. 3 లక్షల 50 వేలు మిగిలాయని వివరించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో వెంకటేశ్వరస్వామి జాతరను విజయవంతం చేశామని తెఇపారు.

ఏసు బోధనలు మానవాళికి మార్గదర్శకం

సీఎస్ఐ పాస్ట్రేట్ కమిటీ చైర్మన్ కనకరత్నం

భూపాలపల్లిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏసు బోధనలు మానవాళికి మార్గదర్శకమని సీఎస్ఐ పాస్ట్రేట్ కమిటీ చైర్మన్ కనకరత్నం అన్నారు. సీఎస్ఐ చర్చి ఆవరణలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతికోసం శిలువలో వేలాడిన ఏసు ప్రభువు జీవితం మానవాళికి ఎంతో ఆదర్శమని, ఆయన బోధనలు అనుసరనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దుప్పటి మొగిలి, కోశాధికారి రవికుమార్, ఇమ్మానియల్, సంకీర్తన, దానియేల్, జాన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన పెద్ది

మేడారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన ఎనగంటి భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్‌లో క్రియాశీలంగా వ్యవహరించిన భద్రయ్య తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని స్మరించుకున్నారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుదని భరోసా ఇచ్చారు. మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు రూ. 15వేలు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, ఏజెన్సీ ప్రాంత గిరిజనేతరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీడి బాబురావు, జిల్లా గ్రంథాలయ సంస్థ వజీఈ చైర్మన్ గోవింద్ నాయక్, నాయకులు లింగయ్య, శ్రీనివాసరెడ్డి, శివరాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

గోవిందరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుస్సాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఐదవ బెటాలియన్ వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు జరుగనున్నాయని అన్నారు. మంత్రి సీతక్క కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని, ఆమె సూచన మేరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. పనులను వెంటనే ప్రారంభించి నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ టి.అలెక్స్, అడిషనల్ కమాండెంట్ ఎన్.పెదబాబు, అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, రాంప్రసాద్, అన్నయ్య, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా అపరాల విత్తనాలు పంపిణీ

కన్నాయిగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయి, ఐలాపూర్ గ్రామాల్లో పోడు రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద అపరాల విత్తనాలను మండల వ్యవసాయ అధికారి మహేష్ మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. 45 మంది రైతులకు వీటిని అందజేశారు. వరి మాగాణుల్లో అపరాలు సాగు చేసుకుని మంచి దుగుబడులు సాధించుకోవాలని సూచించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ములుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్యలాల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది చేత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్రగాని వినయ్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కె.సునీల్‌కుమార్, అదనపు పబ్లిక్ ప్రాసెక్యూటర్ బి.శ్యామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల ఘనంగా జరిగాయి. గంగారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, మాజీ వైస్ ఎంపీపీ చీర్ల తిరుమలతిరుపతిరెడ్డి, కాటారం, కొత్తపల్లి గ్రామపంచాయతీల పరిధిలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి ప్రజలతో కలిసి రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఎంచాయతీ కార్యదర్శులు సఫీర్ ఖాన్, ఉమాదేవి, శంకర్, రాకేష్, జ్యోత్స్న, కృష్ణవేణి, రాజశేఖర్, నవ్యశ్రీ, సునిత, దేవేందర్, శ్రీనివాస్, శేఖర్, గంగాధరన్, శివ, సురేష్, సాయి, లక్ష్మి, ప్రసన్న తదితరులు ఉన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి. నవీన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కావేరి చిన్నకృష్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూజలమాలు నివాళులు అర్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటయ్య, జ్యోతి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, కళాశాల అధ్యాపకులు, తెలంగాణ నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

• మేడారం (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండల మేడారం, ఊరట్టం, నార్లాపూర్, బయ్యక్కపేట, వెంగళాపూర్, కాల్వపల్లి గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ గిరిబాబు, కార్యదర్శులు రవి, సతీష్, ధర్మేందర్, నర్మద, జ్ఞానేశ్వరి, సునీత, ప్రత్యేక అధికారులు. ప్రజలు పాల్గొన్నారు.

• ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి పి.ఉదయశ్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, అధ్యాపకులు భాస్కర్, కవిత, తేజోలత, శంకర్, నాగమణి, శిరీష, రాధిక, విజేత, శంకర్, రమేష్, శ్రీను, నవీన్, లక్ష్మి, ఐలయ్య, ఎస్.రమేష్, పరమేశ్వర్, రమ పాల్గొన్నారు. జగ్గన్నపేట ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ర్యాలీ జరిగింది. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్, పంచాయతీ సెక్రెటరీ స్వాతి, కళాశాల ప్రధానోపాధ్యాయులు, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది జ్యోతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటాపూర్, బీరెల్లి, దామెరవాయి, నర్సాపూర్, తాడ్వాయి, ఇందిరానగర్, కొడిశాల గ్రామాల్లోని పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విద్యార్థులు, ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 100 అడుగుల జాతీయ పతాకంతో పురవీధుల్లో తీశారు. అనంతరం హనుమాన్ సెంటర్‌లో మానవహారం చేపట్టి రాజ్యంగ ప్రతిజ్ఞను చేశారు. తహసీల్దార్ వీరభద్రప్రసాద్, ఎంపీడీవో విజయ, జడ్పీహై స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం స్వరూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పేరూరు ప్రైమరీ స్కూల్, వాజేడు జీపీ కార్యాలయల్లో రాజ్యంగ దినోతవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఎంఈవో వెంకటేశ్వర్లు, వైద్యాధికారి మధుకర్, ఏపీఎం లక్ష్మీదుర్గా, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాజేడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

• మల్హర్, (ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోతవాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చెలకల రాజుయాదవ్, కారోబార్ అజ్మత్ అలీ, సిబ్బంది ఉన్నారు.

• వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్లగూడెం, వెంకటాపురం పంచాయతీల్లో రాజ్యాంగ దినోతవాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు హాజరయ్యారు. అదేవిధంగా ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మండలకేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈజీఎస్ ఏపీవో భవాని, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రసాద్, కిరణ్, ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు కొర్సా నర్సింహమూర్తి, పూనెం సాయి, ఉయిక శంకర్, సర్వేష్, ప్రతాప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుంట, లక్ష్మీదేవిపేట, వెంకటాపూర్, అడవిరంగాపూర్, నర్సాపూర్, తదితర గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో వందరోజులు పూర్తిచేసుకున్న కూలీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మూడ్ రాజు, ఏపీవో నారగోని సునీత, ఈసీ జనగాం సురేష్, పంచాయతీ కార్యదర్శులు దామోదర్, దుర్గాప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు కుమార్, సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పోలోజు రామాచారి, కేతిరి రాధిక, నల్లబెల్లి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హేమ, ఎస్సై షాఖాన్, ప్రిన్సిపాల్ విశ్వపతి, శ్రీదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఎస్ నాయకులు పుల్ల మల్లయ్య, రాజేందర్, గోల్కొండ సురేష్, దొడ్డి కిష్టయ్య, కట్కూరి మొగిలి, పుల్ల ప్రతాప్, గురుకుంట కిరణ్, తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

• భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): . రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి హాజరయ్యారు. అధ్యాపకులు శ్రీనివాస్, రఘోత్తంరెడ్డితో పాటు న్యాయ సేవాధికార సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో రోడ్ల నిర్మాణాలు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సహకారంతో ఆయకట్టు రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని కాసింపల్లి నుంచి గొర్లవీడు రూ. 3 కోట్ల 60 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు.

రైతులు, ప్రజల సహకారంతో గొర్లవీడు, వజినెపల్లి, నేరుడుపల్లి, కొంపెల్లి, గుడాడ్‌పల్లి రైతులకు ఉపయోగపడేలా రోడ్లు నిర్మాణాలు చేపడుతామని అన్నారు. దేశ చరిత్రలో ఎవరూ చేయని విధంగా అనతికాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి చేసి చూపిం చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో నారాయణరావుతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గణపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంద న్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, నాయకులు కావటి రవి, మలహల్‌రావు, మాధవరావు, సంపత్‌రావు, రాజేందర్ పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను పండుగలా జరుపుకోవాలి

జిల్లా ఇన్‌చార్జ్ సుధీర్ కుమార్

ములుగు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దీక్షా దివస్‌ను పండగలా జరుపుకోవాలని మాజీ జడ్పీ చైర్మన్, దీక్షా దివస్ ములుగు ఇన్‌చార్జి ఎం.సుధీర్ కుమార్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 29న గ్రామగ్రామాన ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చాలన్నారు. మంగళవారం ములుగులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ములుగు మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. సుధీర్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోరాటం అనిర్వచనీయమని, తాను చావడమా.. తెలంగాణ రావడమా.. అని ప్రతినబూని నిరాహారదీక్షతో ఆత్మబలిదానానికి సైతం సిద్ధపడ్డ ఆయన పోరాట పటిమను భవిష్యత్ తరాలకు ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు, నేతలు దీక్షా దివస్‌ను ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున జరిపించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.